



పీఏబీఆర్‌లో మోటార్లు ఆన్ చేస్తున్న కార్మికులు

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విజయవంతం

- సమ్మె విరమణ... పీఏబీఆర్‌లో మోటార్లు ఆన్‌చేసిన కార్మికులు
- బకాయివేతనాలు చెల్లింపునకు అంగీకారం
- పీఎఫ్ బకాయిలకు కొంత గడువు
- కలెక్టర్, ప్రభుత్వానికి కార్మికుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, కళ్యాణదుర్గం టౌన్

. బకాయి వేతనాలు, పిఎఫ్ కోసం వంద రోజులుగా సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పోరాటం విజయవంతం అయ్యింది. బకాయిపడ్డ వేతనాలు, పిఎఫ్ చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలుపడంతోపాటు నిధులు విడుదల చేయడంతో మంగళవారం సాయంత్రం సమ్మెను విరమించారు. పంప్‌హౌస్‌లను ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. దీంతో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె విరమణ పూర్తయింది.

వంద రోజులుగా పోరాటం

బకాయిపడ్డ వేతనాలు, పిఎఫ్ కోసం ఏప్రిల్ 6వ తేదీ నుంచి జులై 15వ తేదీ వరకు వంద రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలో ఉన్నారు. దీంతో కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం తదితర నియోజకవర్గాల్లో అనేక గ్రామాలకు తాగునీరు సరఫరా కూడా ఆగిపోయింది. దీంతో గ్రామాలకు నీటి సరఫరా ఆగింది. పోరాటం సాగిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా మద్దతు కూడా పెరగడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ప్రజాప్రతినిధులకూ ఈ ఒత్తిడి అధికమవడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయించేందుకు తమ వంతు తోడ్పాటును అందించక తప్పని పరిస్థితి నెలకొంది.

కార్మికుల సమస్యపై కలెక్టర్ చొరవ

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల విషయంపై కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కింద రూ.3.83 కోట్లు విడుదల అయ్యాయి. ఈ డబ్బులు ఎస్ఆర్ ఇన్ ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లో గత సోమవారం జమ అయ్యాయి. వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మంగళవారం నుంచి కార్మికులు విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల బకాయిలు చెల్లింపు విషయమై ఆర్డబ్ల్యుఎస్ అధికారులు కార్మికులతో మాట్లాడి వారు విధుల్లోకి వచ్చేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. బకాయిలు చెల్లింపునకు కషిచేసిన కలెక్టర్‌కు కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం లభించేనా..?

కార్మికులు వేతనాలు, పిఎఫ్ కోసం నిరంతరంగా పోరాటం సాగించాల్సి వస్తోంది. పోరాటం సాగిస్తేగాని నిధులు విడుదలయ్యే పరిస్థితులుండటం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మార్గాలను కార్మిక సంఘం నాయకులు సూచిస్తున్నా ప్రభుత్వపరంగా జరగాల్సిన నిర్ణయం జరగడం లేదన్న విమర్శ ఉంది. సిపిడబ్లుస్కీమ్ కింద నడిచే పథకాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపుల్లేవు. ఫైనాన్స్ నిధుల నుంచే నిర్వహణకు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సమస్య వస్తోందని కార్మిక సంఘం నాయకులు సూచిస్తున్నారు.

కార్మిక విజయం

జి.ఓబులు సిఐటియు రాష్ట్ర నాయకులు

కార్మికుల సమిష్ట పోరాట విజయమిది. వంద రోజులుగా కార్మికులు తమ సమస్య పరిష్కారం కోసం పోరాటం సాగించారు. ప్రభుత్వాలు ఈ సమస్యకు తక్షణం పరిష్కారం చూపించాల్సింది. కాని ఇంత వరకు జాప్యం చేయడం సరైంది కాదు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారం విషయంతో తగిన చర్యలు తీసుకోవాలి.

ఉన్నత విద్యకు తప్పని



- ఇంకా ప్రారంభం కానీ డిగ్రీ అడ్మిషన్లు
- ఆన్‌లైన్....ఆఫ్ లైన్‌పైనా స్పష్టత కరువు
- సిలబస్ మార్పులతోనే ఆలస్యమా...!
- అడ్మిషన్‌ల కోసం విద్యార్థుల నిరీక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 86 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 73 ప్రయివేటు, 10 ప్రభుత్వ, 3 అటానమస్ కాలేజీలు ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలో సుమారు 35 వేలకుపైగా సీట్లు ఉన్నాయి. సాధారణంగా 60 నుంచి 70 శాతం మేర సీట్లు భర్తీ అవుతుంటాయి. గడిచిన మూడేళ్ల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. దీంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి. గతేడాది అడ్మిషన్లు ప్రక్రియను ఆలస్యంగా నిర్వహించడం, మూడు విడతలకు మధ్య ఎక్కువ రోజులు ఖాళీ రావడంతో ప్రవేశాలు మరింత తగ్గాయి. గత విద్యా సంవత్సరం దాదాపు 40 కళాశాలలకు పైగా 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. కొన్ని గ్రూపుల్లో 10 నుంచి 15 మంది మాత్రమే చేరారు. విద్యార్థులు సంఖ్య తగ్గిన అనేక గ్రూపుల్లో అడ్మిషన్లు నిలిపేయాలని ఆయా కాలేజీలు నిర్ణయించాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది అయినా ప్రవేశాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖను ప్రయివేటు కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వేగంగా అడ్మిషన్లు ప్రక్రియను చేపడితే ప్రవేశాలు పెరుగుతాయని, తద్వారా కాలేజీల నిర్వహణ సులభతరం అవుతుందన్న భావనను వ్యక్తం చేశారు. అయితే కాలేజీల వినతిని ఉన్నత విద్యా శాఖ ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికీ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ ఇవ్వలేదు. షెడ్యూల్ విడుదల చేసిన తరువాత మూడు దశల్లో అడ్మిషన్లు ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం రెండు నెలలు సమయం పడుతుందని, అది కూడా వేగంగా చేస్తేనే ఇది పూర్తవుతుందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రవేశాలు కల్పించడం ఆలస్యమైతే సీట్లు భారీగా మిగిలిపోతాయని చెబుతున్నారు. ఆగస్టు నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తే కొంతలో కొంతైనా మేలు కలుగుతుందన్న భావనను డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి.



ఆఫ్ లైన్ విధానంలో అడ్మిషన్లు...?

ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన వెంటనే డిగ్రీ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడినప్పటికీ ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల వ్యవహారంపై స్పష్టత రాలేదు. గత వైసిపి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లను చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది విద్యార్థుల సిలబస్‌కు సంబంధించి ఉన్నత విద్యామండలి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి సింగిల్ మేజర్ విధానంలో సిలబస్‌ను అమలు పరుస్తున్నారు. సిలబస్‌లో మార్పులు తీసుకురావాలనే చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల అమరావతిలో జరిగిన ఉన్నత విద్యామండలి సమావేశంలో డిగ్రీ మొదటి ఏడాదిలో డబుల్ మేజర్ విధానంలో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలనే అంశంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ మిషన్ కోర్సుల అమలుపై సమీక్ష జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. వీటిని అందుబాటులోకి తెచ్చి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుస్తోంది. అయితే వీటి అమలు కోసం విద్యార్థులను నెలల తరబడి నిరీక్షింప జేయడం ఏమిటంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సబ్జెక్టు విధానాన్ని త్వరితగతిన తేల్చి అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే చేపట్టాలని విద్యా ర్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకుల నుంచి వ్యక్తం అవుతోంది.

తక్షణమే అడ్మిషన్లు చేపట్టాలి



ఇంటర్ ఫలితాలు వెలువడి మూడు నెలలు పూర్తయ్యింది. డిగ్రీ అడ్మిషన్ల కోసం మూడు నెలలుగా విద్యార్థులు ఎదరు చూస్తున్నారు. ఇప్పటి వరకు అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఉన్నత విద్య అడ్మిషన్లు లేకపోవడంతో ఇంటర్ పూర్తి చేసుకున్నా కూడా విద్యార్థులు ఇళ్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టాలి. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ విధానంలో వెంటనే అడ్మిషన్లు జరిపి పాఠ్యంశాలను బోధించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో డిగ్రీలో అడ్మిషన్లు తగ్గి పోయే ప్రమాదం ఉంది.

ఎన్.నాగర్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, శ్రీ సత్య సాయి జిల్లా.

ఉన్నత విద్యను నీరుగార్చే చర్యలు



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను నీరుగార్చేలా విధానాలు అవలంభిస్తోంది. డిగ్రీ ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గతేడాది కూడా ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కళాశాలల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని 83 కళాశాలల్లో సగానికి పైగా కళాశాల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. అడ్మిషన్లు ఆలస్యంగా మొదలు కావడమే దీనికి కారణం. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

ఓతూరు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, అనంతపురం జిల్లా.

డిగ్రీ ప్రవేశాల కోసం ఎస్ఎఫ్ఐ నిరసన



విసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం : శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కళాశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నాడు యూనివర్సిటీ వద్ద ఆందోళన చేపట్టారు. వైస్‌ఛాన్సలర్ బి.అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, యూనివర్సిటీ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టు, డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం కోసం ఉన్నత విద్యా మండలి అధికారుల అభిప్రాయ భేదాలతో నోటిఫికేషన్ రాకుండా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఈ సమస్యను పరిష్కరించి వెంటనే అడ్మిషన్లు ప్రారంభించాలని కోరారు. ఎస్కెయు పరిధిలోని న్యాయవిద్యకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరంలో 84 సీట్లను 66 సీట్లకు కుదించడం సరికాదన్నారు. ఈ విభాగానికి త్వరలో రానున్న ప్రవేశాల్లో సీట్లను పెంచి అవసరమైతే మరో సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. లా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారందరికీ సీట్లు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శాంతరాజ్, విజయ్, సాయికుమార్, విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెన్షనర్లను ఇబ్బంది పెట్టొద్దు

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ - కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేసే చట్టాలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ డిమాండ్ చేశారు. ఆర్థిక బిల్లు ఉప సంహరించి ప్రవేశపెట్టిన వాలిడేషన్ అమైన్‌మెంట్‌ను రద్దు చేయాలన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో గేయానంద్‌తో పాటు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజి.రాజమోహన్ రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలిడేషన్ అమైన్‌మెంట్ సవరణ అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు పెన్షనర్లు మాత్రమే కాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు కూడా నష్టపోయే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో 8వ, ఆంధ్రప్రదేశ్‌లో 12వ పే కమిషన్‌ను నియమిస్తూ తక్షణం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు, డిఆర్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉద్యోగ, పెన్షనర్లకు ఆరోగ్య బీమా పథకం అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలుకు తగ్గించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్, నగర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, కోశాధికారి రామకృష్ణ, సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

మధ్యాహ్నం భోజనం వద్ద విద్యార్థుల తోపులాట

ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-గుంతకల్లు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

పట్టణంలోని ఎస్‌జెపి ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం వద్ద ప్లేట్ల కోసం విద్యార్థుల తోపులాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో విద్యార్థి రామన్న చేతికి తీవ్రమైన గాయమైంది. వెంటనే తల్లితండ్రులకు సమాచారం అందించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న డివైఎఫ్ఐ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని పరిశీలించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ప్లేట్ల కోసం పెనుగులాడుకుంటున్నా ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన హెచ్ఎం, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలుడిని పరామర్శించిన వారిలో డివైఎఫ్ఐ నాయకులు వంశీ, కిషోర్ తదితరులు ఉన్నారు.

పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే అడ్డుకుంటాం..!

టిడిపి మహిళా కౌన్సిలర్ల హెచ్చరిక - జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు భారీగా చేరిన మహిళలు

ప్రజాశక్తి-తాడిపత్రి



జెసి నివాసం వద్దకు వచ్చిన మహిళలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

గత ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాల పాటు అభివృద్ధికి ఆటంకాలు కలిగించి అరాచకాలు సృష్టిస్తూ దాదాపుగా 1500 మందిని అకారణంగా జైళ్లకు పంపిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఖచ్చితంగా అడ్డుకుంటామని టిడిపి కౌన్సిలర్లు, నాయకులు హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం రీకాల్ చంద్రబాబు పేరుతో చేపట్టిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారని సమాచారంతో జెసి.ప్రభాకర్‌రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున పట్టణ మహిళలు చేరుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జింక లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అరుణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మలు మాట్లాడుతూ పెద్దారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన ప్రత్యర్థులను అకారణంగా జైళ్లకు పంపారన్నారు. మహిళలపైనా అక్రమ కేసులు బనాయించారన్నారు. పెద్దారెడ్డి వస్తే తాడిపత్రిలో మళ్లీ ఫ్యాక్షన్ ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే తాము ఆయన్ను అడ్డుకుంటామని తెలియజేశారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులూ తాడిపత్రిలో అభివృద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచెలంచెలుగా అభివృద్ధి జరుగుతోందన్నారు. తాడిపత్రిలోకి వైసిపి నాయకులు ఎవరైనా రావొచ్చని, పెద్దారెడ్డి కుటుంబాన్ని మాత్రం రానివ్వమన్నారు. 18వ తేదీ పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారనే ప్రచారం ఉందని, వస్తే అడ్డుకుంటామని మహిళలు తెలియజేశారు.

మహిళలు, ప్రజలకు రుణపడి ఉంటాం : జెసి.ప్రభాకర్‌రెడ్డి

జెసి కుటుంబం ఎప్పటికీ తాడిపత్రి ప్రజలు, మహిళలకు రుణపడి ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ రీకాల్ చంద్రబాబు కార్యక్రమం సందర్భంగా తాడిపత్రికి కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నారన్న సమాచారంతో మహిళలు, తెలుగుదేశం కార్యకర్తలు, జెసి అభిమానులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి వారిని ఉద్దేశించి మాట్లాడారు. తమ కుటుంబం తాడిపత్రిలో ఉందంటే అందుకు ఈ ప్రాంత ప్రజల అభిమానమే అన్నారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే అయన్ను తరిమి కొట్టేందుకు ఇంత పెద్ద ఎత్తున మహిళలు తన నివాసానికి రావడం సంతోషాన్ని ఇస్తోందన్నారు.

జన్యుమార్పిడి విత్తనాల దిగుమతులను వ్యతిరేకించాలి

అనంతపురం కలెక్టరేట్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న దారుణమైన ఒత్తిళ్లను గ్రహించి జన్యుమార్పిడి విత్తనాల దిగుమతులను మోదీ ప్రభుత్వం వ్యతిరేకించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా విధించిన టారిఫ్ వల్ల బారత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అమెరికాకు అనుకూలంగా భారత్‌ని మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. టారిఫ్‌ల గురించి భారత్‌తో చర్చల సందర్భంగా జన్యుమార్పిడి విత్తనాలు కొనుగోలు చేయాలని అమెరికా వత్తిడి తీసుకొస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే అమెరికా ఒత్తిడిలకు తలొగ్గి జన్యు మార్పిడి విత్తనాల దిగుమతికి అంగీకరించినట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయన్నారు. ఇదే జరిగితే భారత వ్యవసాయం తీవ్ర ప్రమాదంలో పడుతుందన్నారు. జెన్యుమార్పిడి విత్తనాల ధరలను అమెరికా పేటెంట్ కలిగిన బహులజాతి కంపెనీలే నిర్ణయిస్తాయని తెలిపారు. విత్తనాల కోసం బహుళజాతి కంపెనీలపై ఆదార పడేలా చేస్తాయని తెలిపారు. రైతులను ఫణంగా పెట్టి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడే ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

18న 'ఛలో ఢిల్లీ'

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని, ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలివచ్చి జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం స్థానిక హంపీరెడ్డి భవనంలో ఛలో ఢిల్లీ ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్రం ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎనలేని సేవలు అందిస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కేంద్రాన్ని నిలదీసేందుకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాకు యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపిటిసిలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

27 నెలలుగా వేతనాలు రాలేదని ఆగ్రహిస్తూ మండలంలోని ఎంపిటిసిలు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశం ప్రారంభం కాగానే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఉప ఎంపిపి రమేష్ ప్రతిపాదించారు. ఇందుకు మిగిలిన ఎంపిటిసిలు ఆమోదించారు. అనంతరం ఎంపిటిసిలు కార్యాలయం బయట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధుల్లో ఎంపిటిసి రూ.4లక్షల చొప్పున పనులు ఇస్తామని చెప్పి తమ ప్రమేయం లేకుండా పనులు చేశారన్నారు. దీనికితోడు కనీసం వేతనాలు కూడా ఇవ్వకుండా ఎలా ప్రశ్నించారు. దీంతో తాము విధులు బహిష్కరించామని ఎంపిటిసిలు శివశంకరమ్మ, తిమ్మప్ప, రమేష్, చిక్కన్న, నాగమణి, హనుమంతు వాపోయారు. అనంతరం ఎంపిడిఒ విజయభాస్కర్, తహశీల్దార్ మునివేలు, ఇఒఆర్‌డి దాస్, ఎంపిపి భర్త చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఎంపిటిసిలతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది.



సమావేశం బహిష్కరించిన ఎంపిటిసిలు

ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్న అధికార పార్టీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రశాంతమైన మండలంలో అధికార పార్టీ నాయకులు ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆరోపించారు. ఇటీవల చెన్నంపల్లిలో చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిఐ పుల్లయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన తాను మంత్రిగా ఉన్నప్పుడు, గత వైసిపి హయాంలో నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేదన్నారు. చెన్నంపల్లిలె గత రాత్రి జరిగిన గొడవలో 9 మంది వైసిపి కార్యకర్తలు, పేదింటి కుటుంబ సభ్యులను కొట్టి హింసించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా చట్టానికి లోబడి అధికారులు పని చేయాలన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలను విడుదల చేయకపోతే వేలాది మందితో పోలీస్‌స్టేషన్ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచు పార్వతి, కాలవ శ్రీనివాసులు, పూల నారాయణస్వామి, రేకులకుంట లక్ష్మీనారాయణ, గాంధీనగర్ ఆదినారాయణ, పురుషోత్తం, పసలూరు భయపరెడ్డి, ఎస్సీ సెల్ కాటమయ్య, వడియంపేట అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం

గుత్తి : రైల్వే ఇన్సిట్యూట్ పాలకవర్గానికి సంబంధించి మంగళవారం జరిగిన ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానెల్ విజయం సాధించింది. తొమ్మిది మందితో ఏర్పడే రైల్వే ఇన్సిట్యూట్ పాలకవర్గానికి దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే సంఘ్ ప్యానల్‌లు ఎన్నికల బరిలో నిలిచాయి. ఎన్నికల్లో 9 మంది మజ్దూర్ యూనియన్ అభ్యర్థులు విజయం సాధించారు. కార్యదర్శిగా నాయబ్ రసూల్, సహాయ కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా ఎస్ఎం కృష్ణ, డైరెక్టర్లుగా రామాంజనేయులు, పి.వెంకటేష్, ఎం.బాలకృష్ణ, గణేష్ సింగ్ మీనా, పి.సుంకన్న టి.కంబయ్య గెలుపొందారు.

పి-4తో పేదరిక నిర్మూలన

అనంతపురం : ప్రభుత్వం తీసుకొచ్చిన పీ 4 ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047, జీరో ప్రావర్టీ పీ.4' అమలుపై జిల్లాలోని అన్ని ప్రయివేట్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్లు, మెడికల్ డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతం సాధ్యమన్నారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

జైకిసాన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఉరవకొండ

జైకిసాన్ ఫౌండేషన్ ద్వారా రైతులకు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు శాస్త్రవేత్తలు కొనియాడారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలోని యాదవ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'జై కిసాన్ కృషి సహకార్' మెగా వ్యవసాయ శిక్షణ విజయవంతమైంది. ఇందులో భాగంగా కిమ్స్ సవేరా వారి సహకారంతో వందమంది రైతు దంపతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఒకరోజు మెగా వ్యవసాయ శిక్షణలో భాగంగా ఉద్యానవన శాఖ డిడిహెచ్ ఉమాదేవి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐ పీడీ రఘునాథరెడ్డి, శాస్త్రవేత్తలు విజయ్ శంకర్‌బాబు, మాధవీలత, యుగేందర్, ఉరవకొండ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్.సత్యనారాయణ, బసంపల్లి నాగరాజు, బాయిర్ క్రాప్ సైన్స్ సిసిఎం ఎం.చేతన్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు రజినీకుమారి, నాగమల్లి మనస్వి, చరణ్, లావణ్య, నిరంజన్‌గౌడ్, బసవరాజు, పాల్గొన్నారు.

మంజూరు కాని బిల్లులు.. కాంట్రాక్టర్ల పాట్లు..!

అడ్డంకిగా ప్రభుత్వ నిబంధనలు



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపాల్టీల పరిధిలో గడచిన సంవత్సరం కాలంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను గుత్తేదారులు చేయించారు. ఇందుకు సంబంధించి బిల్లులు మంజూరులో ప్రభుత్వం నుంచి తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలు గుత్తేదారులకు గుదిబండలా మారాయి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో చేసిన అభివృద్ధి పనులు ముగిసిన తర్వాత వాటిని ఇంజినీరింగ్ విభాగం మెజర్మెంట్ బుక్, ఎంబుక్‌లో నమోదు చేస్తారు. అసిస్టెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, అకౌంట్స్ విభాగం, కమిషనర్, ఎగ్జామినర్ ఇలా వివిధ దశల్లో బిల్లులను పరిశీలించి వాటిని సిఎఫ్ఎంఎస్‌లో నమోదు చేస్తారు. ఆర్థిక సంవత్సరం ముగిసే క్రమంలో మార్చి 31వ తేదీలోగా బిల్లులు మంజూరు చేయడం పరిపాటిగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక సంవత్సరం ముగిసే క్రమంలో ఒక్క మున్సిపాల్టీలో కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయలేదు. ఇతర శాఖల్లో బిల్లులు వస్తున్నా మున్సిపాల్టీల్లో మాత్రం రాకపోవడం గమనార్హం. సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న బిల్లులను రద్దుచేసి తిరిగి కొత్తగా అప్లోడ్ చేయడానికి రెండు నెలలకుపైగా నిబంధనలు జారీ చేయకుండా జాప్యం జరిగింది. అప్లోడ్ చేయడానికి అనుమతి ఇస్తూ తిరిగి మెలిక పెట్టారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీల బిల్లులను కమిషనర్ ఎగ్జామినర్ తనిఖీలతో పాటు, పేఅండ్ అకౌంట్ ఆఫీస్ ద్వారా తనిఖీ చేసి మంజూరుకు అనుమతి ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్క్ ఆర్డర్ సమయంలో ముఖ్యమైన నాలుగైదు కాగితాల్లో మాత్రమే సంబంధిత ఇంజినీర్లు, కమిషనర్లు సంతకాలు చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం పే అండ్ అకౌంట్ ఆఫీస్ నిబంధనల ప్రకారం వర్క్ ఆర్డర్ బుక్‌లోని ప్రతి పేజీకి ఇంజినీర్లు, కమిషనర్లు సంతకాలు చేసి ఇవ్వాలని మెలిక పెట్టింది. ఇటీవల కాలంలో ఎంతోమంది కమిషనర్లు, ఇంజినీర్లు బదిలీ అయ్యారు. కొంతమంది ఉద్యోగ విరమణ కూడా చేశారు. వారందరి సంతకాలు చేయించడం కూడా ఆర్డర్లలో చేయించేందుకు రమ్మని పే అండ్ అకౌంట్ ఆఫీస్ మెలిక పెట్టడంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సమకూర్చుకుని అప్పులు చేసి పనులు చేస్తే వాటికి బిల్లులు ఇవ్వకుండా నిబంధనలు అడ్డుచూపడంపై గుత్తేదారులు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. బదిలీ అయిన కమిషనర్లు, ఇంజినీర్లు, ఉద్యోగవిరమణ చేసిన వారితో సంతకాలు చేయించాలంటే అంత సులువు కాదు. ముడుపులు ముట్టజెప్పనిదే వారు సంతకాలు చేయరని గుత్తేదారులు చెబుతున్నారు. పైగా వారు ఎక్కడ పని చేస్తున్నారో తెలుసుకోవడం కూడా కష్టమే. బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేసేందుకే ప్రభుత్వం ఈ మెళిక పెట్టిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్లపై దయవుంచి ప్రభుత్వం పే అండ్ అకౌంట్స్ నిబంధనలను సడలించి బిల్లులు ఇప్పించాలని గుత్తేదారులు వేడుకుంటున్నారు.

రైల్వేగేటు మూసివేత

పుట్లూరు : లెవెల్ క్రాసింగ్ గేట్ 160 (పుట్లూరు రోడ్డు) హైట్ గేజ్ రిపేరి కారణంగా గేట్ రెండు రోజులపాటు మూసివేయనున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (పి వె) రఘురెడ్డి తెలిపారు. లెవెల్ క్రాసింగ్ గేట్ హైట్ గేజ్‌కు మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఈనెల 16, 17వతేదీల్లో మూసివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు.

నైపుణ్యాల అభివృద్ధికి సర్టిఫికెట్ కోర్సు

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ, జెకెసి ఆధ్వర్యంలో నైపుణ్యాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ కోర్సును కళాశాల ప్రిన్సిపల్ పి.హర్షలత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం నూతన విద్యార్థులకు ఇంటర్, డిగ్రీకి అనుసంధానంగా ఈ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సులో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ స్కిల్స్ నేర్పిస్తారన్నారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో పోటీ పరీక్షలు ఎదుర్కోవడానికి సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల శాఖ అధిపతి కవిత, ఆంగ్ల అధ్యాపకులు కె.రవిశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.శ్రీధర్, తెలుగు అధ్యాపకురాలు ఎంటి జ్యోష్న, జెకెసి మెంటార్ కె.అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతికి నివాళి

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో అటెండర్‌గా పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి భూమిరెడ్డి శివారెడ్డి మృతికి పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. నివాళులర్పించిన వారిలో ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్లు, బోధన, బోధనేతర, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

19న జెఎన్‌టియు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 19వతేదీన శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అల్యూమిని అసోసియేషన్ సెక్రటరీ సి.శోభాబిందు, చాప్టర్ ఉపాధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు వి.శంకర్, యూనివర్సిటీ పిఆర్ఓ బి.ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను కలిసిన అంబులెన్స్ల మేనేజర్

యల్లనూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల వైద్యులు లోకేష్‌కుమార్‌ను 108 అంబులెన్సులు, భవ్య పార్సిల్ కంపెనీ ఉమ్మడి జిల్లా మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సూపర్వైజర్ సోమశేఖరరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అరబిందో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో 108 అంబులెన్సులు నడిచేవన్నారు. అయితే జూన్ 1వతేదీన నుంచి భవ్య పార్సిల్ కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్నట్లు తెలిపారు. అనంతపురం యల్లనూరు ఆసుపత్రికి నూతన అంబులెన్సు మంజూరు చేయాలని వైద్యులు లోకేష్ కోరారు.

జెఎన్‌టియు బీ.టెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 1వ సంవత్సరం, 2వ సెమిస్టర్ (ఆర్.23) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ.టెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, బీ.టెక్ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్, అడిషినల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

అనంతపురం రూరల్ : నియోజకవర్గంలని పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం అనంతపురం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లికి చెందిన రెడ్డివారి దీనా సబిత, కొడిమికి చెందిన కుమ్మర నాగరాజు, దాడితోట పోరెడ్డి వీణకు మంజూరైన చెక్కులను అందించారు.

అవకాశాల సద్వినియోగంతో సత్ఫలితాలు

అనంతపురం : అవకాశాలు సద్వినియోగం చేసుకునప్పుడే సత్ఫలితాలు వస్తాయని సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ అన్నారు. ప్రపంచ నైపుణ్య దినోత్సవం సందర్భంగా సాయిట్రస్టు అధ్వర్యంలో సాయినగర్‌లోని సాయివృత్తి శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కావున విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ రాఘవేంద్ర, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఉపసర్పంచి మృతి

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం మాజీ ఉపసర్పంచు బాల నరేంద్రకుమార్ (59) మృతికి పలువురు నివాళులర్పించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నరేంద్రకుమార్ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి, నాయకులు మల్లికార్జున, శివశంకర్, మల్లికార్జునబాబు, వైసిపి నాయకులు ఉమా మహేశ్వరనాయుడు, దొణస్వామి, నరేంద్రరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, మలా ఎర్రిస్వామి, కరీమ్‌సాబ్, కృష్ణమూర్తి, ఉద్యోగ సంఘం నాయకులు చల్లాకిషోర్, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐసిడిఎస్ కార్యాలయం తనిఖీ

శింగనమల : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఐసిడిఎస్ పీడీ ఎం.నాగమణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రతి సెక్టార్‌లో వందశాతం ఎఫ్ఆర్ఎస్‌టిహెచ్ఆర్ గ్రోత్ ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ చల్లా లలితమ్మ, సూపర్‌వైజర్లు కల్పన, వాణిశ్రీ, ధనలక్ష్మి, కౌసల్య, నేతాజీబీ, విష్ణువర్ధని, ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పి.కొత్తపల్లి సహకార సంఘం బ్యాంకు ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి



పామిడి : పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డిని పి.కొత్తపల్లి సహకార బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బొల్లు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, పామిడి, గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ప్రకాష్‌రెడ్డి, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కౌలుపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పని నిమిత్తం గుత్తి నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. స్థానిక అనంతపురం రోడ్డులో వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దీంతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే ఇద్దరిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం : నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె జిగిలేటి షాలిని అదృశ్యమైనట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. షాలిని సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కాలనీలో ఉన్న పీర్లస్వాములను చూసి వస్తానని చెప్పి వెళ్లిందన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని తెలిపారు. యువతి ఆచూకీ తెలిసినట్లు అయితే త్రీటౌన్ సీఐ 94906 18679, ఎస్ఐ 93469 17115 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-శింగనమల/నార్పల

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ పిలుపు మేరకు 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ తెలిపారు. 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'పై మంగళవారం నియోజకవర్గంలోని శింగనమల, నార్పల మండలాల్లో శైలజానాథ్ పర్యటించి వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం చంద్రబాబు తర్వాత పూర్తిగా విస్మరించారన్నారు. మోసాలు, మాట తప్పడానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. 80 లక్షల మందికి ఇవ్వాల్సిన అమ్మఒడి పథకాన్ని తల్లికివందనం పేరుతో కేవలం రూ.50లక్షల మందికి ఇచ్చారన్నారు. చంద్రబాబుతోపాటు పవన్‌కళ్యాణ్ ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించడానికే రీ కాలింగ్ చంద్రబాబు కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సిఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించి చైతన్యవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్, ఎంపిపి నాగేశ్వరరావు, నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాగరత్నమ్మ, నీలం భాస్కర్, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, గవ్వల శ్రీరాములు, బొందలవాడ రంగయ్య, థియేటర్ భాస్కర్‌రెడ్డి, శింగనమల మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు వంశీగోకుల్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, అమర్నాథరెడ్డి, నూరుఅహ్మద్‌బాషా, బంగారు అలిబాషా, తదితరులు పాల్గొన్నారు.

కెమిసైడ్స్ పరిశ్రమపై విజిలెన్స్ దాడులు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని పారిశ్రామిక వాడలో ఉన్న ఎం/ఎస్ కెమిసైడ్స్ క్రాప్ ప్రొటెక్షన్ పరిశ్రమలో విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. కర్నూలు ఎడిఎ సాలురెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ వీరేంద్ర భూపతి, గుత్తి ఎడిఎ ఎం.వెంకటరాముడు కలిసి పరిశ్రమలో తయారవుతున్న పురుగుల మందుల నాణ్యత ప్రమాణాలు, తయారీకి సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. ముందుగా బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.1.37 కోట్లు విలువచేసే ఎరువులకు సంబంధించి సరైన వివరాలు లేకపోవడంతో వాటి విక్రయాలను నిలిపివేశారు. అలాగే చౌడేశ్వరి సీడ్స్ దుకాణంలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో జెడిఎ కార్యాలయ సాంకేతిక సహాయకుడు రాకేష్‌నాయక్, మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన



ఎండిన పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

జిల్లాలో కురిసిన ముందస్తు వర్షాలకు మండలంలో సాగు చేసి ఎండిపోతున్న కంది, ఆముదం, వేరుశెనగ పంటలను సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కసాపురం, బుగ్గ సంగాల, దోస అల్లుడికి, గుండాల తండా, ములకలపెంట తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి సాగు తీరు, పెట్టుబడి, నష్టపోతున్న వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో వేరుశెనగ పంట ప్రధానంగా ఉండేదన్నారు. అయితే పెట్టుబడులు పెరిగిపోవడంతో కందిపంటను సాగు చేసుకోవడం మొదలు పెట్టారన్నారు. సకాలంలో వర్షాలు కురువగా ముందస్తు వర్షాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. మరోవైపు మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప కురవడం లేదన్నారు. దీంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయన్నారు. అయితే రైతుల వైపు అధికారుగానీ, ప్రజాప్రతినిధులుగానీ కన్నెత్తి చూడకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లాలో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బహుజన సామ్రాజ్యాన్ని నిర్మిద్దాం

ఆలిండియా బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.శ్రీరాములు



ప్రజాశక్తి-అనంతపురం సిటీ

బహుజనులంతా ఏకమై బహుజన సామ్రాజ్యాన్ని నిర్మిద్దామని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాటి నుంచి నేటి వరకూ రాయలసీమ జిల్లాల నుంచి ముఖ్యమంత్రులు అవుతున్నారుగానీ ఈ ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. హంద్రీనీవా కాలువ కింద పిల్ల కాలువల పని పూర్తి చేయకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. సీమ జిల్లాల్లో ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, హంద్రీనీవా కాలువ పనులు, పిల్ల కాలువ పనులు పూర్తి చేస్తే కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 4.60లక్షల ఎకాలకు నీరు అందించవచ్చున్నారు. కరువు జిల్లాల రైతులను ఆదుకోవాలని ఆలిండియా బీఎస్పీ డిమాండ్ చేస్తోందన్నారు. ఇకపోతే ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలన్నారు.

నేడు మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మమతాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సార్.. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి..

ఎమ్మెల్యేకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వినతి



అనంతపురంలో ఎమ్మెల్యే ఇంటికి ప్రదర్శనగా వెళ్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సార్ ఎమ్మెల్యేగారు.. కనీసం మీరైనా మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోండి సారూ..' అంటూ మున్సిపల్ కార్మికులు వేడుకున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 3వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే ఇంటి వరకూ కార్మికులు ర్యాలీ వెళ్లి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్, సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న తరహాలో రూ.21వేలు, రూ.24,500 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని, చనిపోయిన వారిస్థానాల్లో ఉద్యోగాలు కల్పించాలని, సర్వీసు 62ఏళ్లకు పెంచాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందిస్తూ రాష్ట్రానికి సంబంధించిన అంశాలన్నీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, నగర కార్యదర్శి మురళి, కోశాధికారి పోతులయ్య, హెల్త్‌వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, మున్సిపల్ నాయకులు, సుబ్బిరెడ్డి, సలీం,రవికిరణ్, రవి, బండారి ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, లక్ష్మీ, సుజాత, కోనప్ప శివన్న, శేషేంద్ర, గురురాజు, ఆకులప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నిరవధిక సమ్మెలో భాగంగా పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మోకాళ్లపై నిలుచుని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

తాడిపత్రి : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె తాడిపత్రిలో మంగళవారం 3వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా వంటావార్పు చేసుకుని అక్కడే భోజనం చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు మల్లి, సిఐటియు నాయకులు రామాంజినేయులు, జగన్‌మోహన్‌రెడ్డి, నరసింహరెడ్డి, ఉమాగౌడ్, రామ్మోహన్, హనుమంతురెడ్డి, ఇంజినీరింగ్ సెక్షన్ అధ్యక్షులు జుబేర్, కార్యదర్శి శ్రీరాములు, ఉపాధ్యక్షులు బాషా, ట్రెజరర్ ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం రిలే నిరాహార దీక్షలు 3వ రోజుకు చేరుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్, ఉపాధ్యక్షులు ఎస్ఎ మురళి, రాజకుమార్, సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆదినారాయణ, కోశాధికారి నక్క శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి

డిఎల్‌డిఒ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి అందరం కృషి చేద్దామని డిఎల్‌డిఒ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ పురోగతి సూచిక పిఎఐ-వి2.0 కార్యక్రమంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో సచివాలయ ఉద్యోగులు చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి సిబ్బందికి సోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలంటే అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రంగనాయకులు, హౌసింగ్ ఎఒ లోకనాథ్‌చౌదరి, ఎంఇఒ విజయకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసేకరణ పరిశీలన

మండల పరిధిలోని బోరంపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణను డిప్యూటీ ఎంపిడిఒ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శి నవీన్‌తో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా చెత్త సేకరణపై కార్మికుల పనితీరును ఆరాతీశారు. ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలతో నేరుగా మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్త వేరువేరుగా కార్మికులకు అందించాలని సూచించారు.

గుండెపోటుతో టిపిఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు మృతి



ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణానికి చెందిన టిపిఆర్ ట్రస్ట్ అధినేత, కసాపురం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతిగుడి నిర్మాణకర్త తలారి పరశురాముడు మంగళవారం గుండెపోటుతో మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం నాడు గూగూడు కుళ్లాయి స్వామి దర్శనానికి పరశురాముడు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం అక్కడ ఉండగా ఒక్కసారిగా ఆయన కుప్పకూలి కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యసేవలు కోసం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మతి చెందినట్లు తెలిపారు.

తలారి పరశురాముడుకి పలువురు నివాళులు

గుండెపోటుతో అకాలమరణం చెందిన రాజకీయనేత, టిపిఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, కసాపురం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతిగుడి నిర్మాణ కర్త తలారి పరశురాముడుకు పలువురు నివాళి అర్పించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు పరశురాముడు స్వగృహానికి వెళ్లి మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి జిల్లా నాయకులు గాది లింగేశ్వరబాబు, జిల్లా నాయకులు మంజునాథ రెడ్డి, దశరథ రెడ్డి, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, కౌన్సిలర్ రామగౌని పవన్ కుమార్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకుడు ముక్కన గారి రామాంజినేయులు, మున్నా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన



కంపోస్టుయార్డులో పర్యటిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో చేపట్టిన పారిశుధ్య పనులతోపాటు కంపోస్టు యార్డు పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ముందుగా కమిషనర్ బాలస్వామితో కలిసి కంపోస్ట్ యార్డుతోపాటు అరవింద్‌నగర్, విద్యుత్‌నగర్, జీసస్‌నగర్, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్తసేకరణ, ప్లాస్టిక్ విక్రయాలపై నిరంతరాయంగా దాడులను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ రాజశేఖర్, ఇఇలు షాకీర్, నరసింహులు, పబ్లిక్ హెల్త్ సర్కిల్ ఆఫీస్ ఇఇ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎంహెచ్ఒ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఒ రవిశంకర్‌రెడ్డి

ఓటర్ల జాబితాపై సమావేశం

రాయదుర్గం : ఓటర్ల జాబితా రూపకల్పనపై రాయదుర్గంలోని తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ ఎన్.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో ఫారం 6, 7, 8 సమర్పణ వాటిపై అభ్యంతరాలు, చేర్పులు, మార్పులు, సవరణలు, పోలింగ్ కేంద్రాల విభజన మొదలైన అంశాలపై ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట పునర్విభజన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా బిఎల్‌ఒల శిక్షణ శిబిరం మంగళవారం 5వ రోజు డ్వామా మీటింగ్ హాలులో కొనసాగింది. మాస్టర్ ట్రైనర్ వెంకట రమేష్ పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు ఓటర్ల జాబితా తయారీలో చేర్పులు మార్పులు తొలగింపులకు సంబంధించి ఫారం 6, 7, 8పై అవగాహన కల్పించారు.

18న జాబ్‌మేళా

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు ఈనెల 18వతేదీన పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మంగళవారం ప్రజావేదిక నుంచి ఒ ప్రకటనలో వెలువడింది. నిరుద్యోగ యువత కోసం రెండోసారి నిర్వహించనున్న జాబ్‌మేళాలో దాదాపు 20కి పైగా మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

తాడిపత్రి రూరల్ : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని మాకం ఎంటర్‌ప్రైజెస్, రంగేశ్వర, బాలాజీ తదితర దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సాయిరెడ్డి విజిలెన్స్ ఎస్‌ఐ నరేంద్ర భూపతి తాడిపత్రి ఎడిఎ రవీంద్ర, మండల అధికారి ఆంజనేయులు, టెక్నికల్ ఎఒ రాజేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల : వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సాంబశివారెడ్డిని ఇటీవల వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన విషయం తెలిసిందే. దీంతో జగన్‌ను సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన

యల్లనూరు : మండల పరిధిలోని పెద్దమల్లేపల్లి గ్రామ పంచాయతీ కొండాపురం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై జిల్లా పరిషత్ సిఇఒ శివశంకర్ మంగళవారం అవగాహన కల్పించారు. పర్యావరణ పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కరుణసాగర్, ఎఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



చెత్తసేకరణపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సిఇఒ శివశంకర్

కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందాలి

'పొలం పిలుస్తోంది'లో జిల్లా వ్యవసాయధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రాన్ని పొందాలని జిల్లా వ్యవసాయధి శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సాగుపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరొక రైతు భూమిని సాగు చేసుకుంటున్న వారు మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాలకు వెళ్లి గ్రామ రెవిన్యూ అధికారిని కలిసి పంట సాగు హక్కుపత్రాన్ని పొందాలన్నారు. తద్వారా రైతులకు పంట నష్టపరిహారం, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు నష్టపరిహారం, బీమా వంటివి పొందవచ్చున్నారు. ఇకపోతే ఈనెలాఖరులోగా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల కింద రైతుల ఖాతాల్లో రూ.7000 జమ చేయనున్నట్లు తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద కొన్ని గ్రామాల్లో కంది విత్తనాలను బయోమెట్రిక్ విధానం ద్వారా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంటల వారీగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. అనంతరం రైతులకు కంది మినీ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి గోవిందరాజులు, మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్, పట్టు పరిశ్రమ అధికారి రమాకాంత్, ప్రకృతి వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి నాగరాజు, గ్రామ ఉద్యాన సహాయకులు నరేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


రాప్తాడు : మండల కేంద్రంతోపాటు మరూరు, హంపాపురం రైతు సేవాకేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ రైతులకు సాగుపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, ఎఇఒ రంజిత, విహెచ్‌కె పేర్సి, ఎంపిఇఒ రాధ, పద్మ, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ఉరవకొండ : భూసార పరీక్షలు చేపట్టి అందుకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు విజయ శంకర్‌బాబు, ఎల్.మాధవీలత సూచించారు. మంగళవారం విడపనకల్లు మండలం పాల్తూర్, హవళిగి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వేరుశెనగలో సూక్ష్మపోషకాల లోపంతోపాటు జింక్, ఐరన్ లోపం ఉందన్నారు. దీనివల్ల ఆకులు పసుపు రంగులో మారుపోయి దిగుబడి తగ్గుతుందన్నారు. నివారణకు ఫెర్రస్ సల్ఫేట్, జింక్ సల్ఫేట్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులు, కాండం కుళ్లు తెగులు నివారణకు అధిక నీటితడులు ఇవ్వకుండా, అధికంగా నత్రజని ఎరువుల వాడకం తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం 1,032 శాంపిల్స్ తీసుకుని అనంతపురం భూసార పరీక్ష కేంద్రానికి పంపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ ఎస్.సత్యనారాయణ, ఎఇఒ కైలాష్, ఎంపిఎఒ మెర్సీ, రైతులు బాలకృష్ణ, బాలమూర్తి, బిటి ఎర్రిస్వామి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలంలో పాల్గొన్న అధికారులు





రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారుల, శాస్త్రవేత్తలు

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతూ తమపైనే విమర్శలు చేయడం బాధాకరమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని 47వ డివిజన్ రంగస్వామి నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని విరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం నడిమివంక ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నిర్మించాల్సిన ప్రొటెక్షన్ వాల్స్, బ్రిడ్జిల గురించి చర్చించారు. తర్వాత అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసేసి సౌకర్యాలు, సరుకులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ -2 నాటికి డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా తరలిస్తామని పునరుద్ఘాటించారు. నడిమి వంక, మరువ వంక ప్రొడక్షన్ వాల్స్, బ్రిడ్జి నిర్మాణాలు చేపడతామన్నారు. నేను ఎక్కడ అభివృద్ధి చేశానో చెప్పాలని మేయర్ వసీం పదే పదే చెబుతున్నారని.. తాను వచ్చాక ఎక్కడెక్కడ ఎంతమొత్తంలో ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నది పాంప్లెట్ పేపర్ వేసి వివరించామన్నారు. అయినా మేయర్‌కు అర్థమైనట్టు లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దలవాయి వెంకటనారాయణ, దలవాయి రమాదేవి, తలారి ఆదినారాయణ, పిఎల్‌ఎన్ మూర్తి, డిష్ నాగరాజు, ఈటె స్వామిదాస్, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్‌అహ్మద్, సంగా తేజస్విని, సుధాకర్‌యాదవ్, తొండపునాటి రమేష్, బల్లా పల్లవి, సరళ, మల్లెల దుర్గేష్, రాయల్ మధు, చేపల హరి, మణి రవి, నెట్టెం బాలకష్ణ, దలవాయి రమాదేవి, దాడి మల్లికార్జున, వడ్డే భవాని, వడ్డే వెంకటేష్, టైలర్ శీన, ఈడిగ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలోని 9, 13వ వార్డుల్లో మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, గుత్తి, పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని విరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, రంగనాయకులు, అప్పన్నగారి కుమార్, పసల శ్రీరాములు, సుంకప్ప, తేల్‌బాషా, మహమ్మద్ రఫీ, నల్లబోతుల శీన, ఐ టిడిపి సోషల్ మీడియా శివ అభిరామ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

'తొలి అడుగు'లో ఎమ్మెల్యేలు



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

కళ్యాణదుర్గం రూరల్ : నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మంగళవారం కంబదూరు మండలం మరిమాకులపల్లి, గుద్దిళ్ల గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహర్షి వాల్మీ విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గం రూరల్ మండలం, కంబదూరు మండలాల్లో సోలార్, ఇతర పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. వాటి ద్వారా యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో కాలువ పనులు

పూర్తి చేయాలి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

యాడికి ప్రధాన కాలువలో సమయానికి పూడికతీత పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. పెద్దవడుగూరు నుంచి యాడికి మండలానికి వెళ్లే ప్రధాన కాలువలో చేపట్టిన పూడికతీత పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాడికి మండలానికి ఈఏడాది పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కాలువల నుంచి తీసిన మట్టిని మళ్లీ తిరిగి వెళ్లకుండా ఉండేలా చూడాలని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశవరెడ్డి, గంగరాజు, దివాకర్‌రెడ్డి, బాలిరెడ్డి, ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, చిరంజీవులు, వెంకటరామిరెడ్డి, హరికృష్ణారావు, శ్రీనివాసులు, నరేంద్ర, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, శరణ్, తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, టిడిపి నాయకులు